గర్మిళ్లపల్లిలో ఎమ్మెల్యే కడియంను ప్రశ్నిస్తున్న మహిళ

తులం బంగారం ఏది సారు?

- 'కల్యాణలక్ష్మి' పంపిణీలో ఎమ్మెల్యేను ప్రశ్నించిన మహిళ
- నెమ్మదిగా ఒక్కొక్కటి ఇస్తామని చెప్పిన కడియం

ఐనవోలు, నవంబర్ 9: రూ.లక్షా నూటపదహార్ల చెక్కు ఇచ్చారు సరే.. తులం బంగారం ఏది సారూ అంటూ ఓ మహిళ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ప్రశ్నించారు. శనివారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి శివారులో నందనం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గర్మిళ్లపల్లికి చెందిన కొండ రేణుకకు కల్యాణలక్ష్మి కింద మంజూరైన రూ.లక్షా నూటపదహార్ల చెక్కును అందజేశారు. చెక్కు తీసుకున్న ఆమె.. 'లక్షానూటపదహార్ల చెక్కు ఇస్తున్నావు సరే కానీ.. తులం బంగారం ఏది సారూ' అంటూ శ్రీహరిని అడిగింది. దీంతో ఇంత సేపు అదే చెప్తితిని కదా.. నెమ్మదిగా ఒక్కొక్కటి ఇస్తామంటూ నవ్వుకుంటూ కడియం సమాధానం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని, సర్కారు, సీఎం రేవంత్‌రెడ్డిపై విశ్వాసం ఉంచాలని కోరారు.

మంత్రి కుమారుడి రాసలీలలు?

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి కుమారుడి రాసలీలలు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. పెండ్లి చేసుకుంటానంటూ ఓ యువతిని నమ్మించి మోసం చేశాడని, ఇప్పుడు ఆ యువతి గర్భవతి అని ప్రచారం జరుగుతున్నది. దీంతో గత్యంతరం లేక తాము సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాలను బయటపెడతానని ఆ యువతి బెదిరిస్తున్నదని ప్రచారం జరుగుతున్నది. దీంతో సదరు మంత్రి కుటుంబం ఆ యువతితో సంప్రదింపులు జరుపుతున్నదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ అంశం సోషల్‌మీడియాతోపాటు కాంగ్రెస్ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారిందని సమాచారం. ఆ మంత్రి ఎవరు? ఏమిటా కథ! అంటూ చర్చించుకుంటున్నారు.

చిరుత కలకలం

దోమలపెంట, నవంబర్ 9 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట, ఈగలపెంట పరిధిలో కొన్ని రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రెండ్రోజుల కిందట దోమలపెంటలో జెన్‌కో కార్మికురాలైన రూప ఇంట్లోకి చొరబడి పెంపుడు కుక్కను చంపింది. ఈ విషయాన్ని స్థానికులు ఫారెస్ట్ రేంజర్ గురుప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. చిరుత తిరిగే ప్రదేశాలు గుర్తిస్తామని హామీ ఇచ్చారు. కాగా, బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించారు.

రోడ్డెక్కితే పన్ను!

- రాష్ట్ర రహదారులపై త్వరలో టోల్‌ట్యాక్స్
- ప్రైవేటుపరం చేసేందుకు ప్రణాళిక
- ఇప్పటికే రోడ్లను గుర్తించిన ఆర్‌అండ్‌బీ
- త్వరలో నిర్ణయం ప్రకటించే చాన్స్

హైదరాబాద్, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): రాష్ట్ర రహదారులపై కూడా ఇక టోల్‌బాదుడు తప్పేలాలేదు. త్వరలోనే వీటిని ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దీనికి ప్రతిఫలంగా రాష్ట్ర రహదారులపై టోల్‌ప్లాజాలను ఏర్పాటుచేసి, ట్యాక్స్ వసూళ్ల అధికారాన్ని ఆయా ఏజెన్సీలకు అప్పగించాలని భావిస్తున్నది. ఇప్పటికే దీనిపై ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించగా, అధికారులు పలు ప్రధాన రోడ్లను గుర్తించి నివేదిక అందించినట్టు సమాచారం.

రాష్ట్రంలో రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు తదితర అన్నీ కలుపుకొని ఆర్ అండ్‌బీ శాఖ పరిధిలో 24,245 కిలోమీటర్ల పొడవైన రోడ్లున్నాయి. 2690కిలోమీటర్ల మేర ఉన్న జాతీయ రహదారుల నిర్వహణ బాధ్యత కేంద్రం పరిధిలో ఉండగా, రాష్ట్ర రహదారుల నిర్వహణ బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదే. అయితే కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పూర్తిగా నిలిపివేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోడ్ల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేయడంతో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. టెండర్లు పిలిచినా బిల్లులు వస్తాయో.. రావో అనే అనుమానంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రహదారుల నిర్వహణ బాధ్యతలు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించాలని నిశ్చయించింది.

ఇప్పటికే అందిన నివేదిక

3,152కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్న స్టేట్ హైవేస్‌పై, అలాగే, కొన్ని జిల్లా రోడ్లపై కూడా టోల్ వసూలుకు అవకాశం ఉందని అధికారులు నివేదిక ఇచ్చినట్టు సమాచారం. దీంతో త్వరలోనే ప్రభుత్వం దీనిపై విధానపరమైన ప్రకటన చేసే అవకాశముంది. టెండర్ల పద్ధతిలో వీటిని ప్రైవేట్‌కు కట్టబెట్టనున్నారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీలో కొంతకాలంగా రోడ్ల నిర్వహణ బాధ్యత ప్రైవేటు ఏజెన్సీల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నది. టెండర్ల పద్ధతిలో జోన్లవారీగా వివిధ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. నిర్ధారిత మొత్తానికి ఏటా కొంత శాతం పెంచుతూ ఏజెన్సీలకు చెల్లిస్తున్నారు. ఎక్కడ గుంత పడినా, రోడ్డుకు నష్టం జరిగినా వెంటనే పూడ్చాల్సిన బాధ్యత ఆయా ఏజెన్సీలపై ఉంటుంది. ఐదేళ్లకోసారి రోడ్ల పునరుద్ధరణ పనులు మాత్రం జీహెచ్‌ఎంసీ విడిగా నిర్వహిస్తుంది. కేవలం నిర్వహణ బాధ్యతలు మాత్రమే ఏజెన్సీ చూసుకుంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్రప్రభుత్వం ఇదే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

రాష్ట్రంలో రహదారుల వివరాలు...

స్టేట్ హైవేలు	3,152
మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు	ఇతర డిస్ట్రిక్ట్ రోడ్లు
12,079	9,014
జాతీయ రహదారులు	2,690 (16రహదారులు)
మొత్తం 26,935	

రేవంత్‌రెడ్డి 'మహా' అబద్ధాలు!

మొదటిపేజీ తరువాయి...

నెరవేర్చినట్టు అబద్ధాలను అలవోకగా వల్లెవేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో శనివారం ప్రచారానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ముంబైలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేసినట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పథకాల్లో పెట్టిన కోతల గురించి చెప్పకుండా.. మాటల 'కోతలు' కోయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే.. నెరవేర్చినట్టు అబద్ధాలు చెప్పడమేంటని ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముంబైలో చెప్పిన అబద్ధాలు, అసలు వాస్తవాలు ఏమిటో తెలుసుకుందాం.

రేవంత్ అబద్ధం: **తెలంగాణలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్లు మాఫీ చేశాం.**

వాస్తవం: అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 వరకే ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, 8 నెలల తర్వాతే రుణమాఫీకి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు రూ.2 లక్షల రుణం కలిగిన రైతుల్లో పూర్తిగా రుణమాఫీ చేయలేదు. ఇప్పటివరకు 22 లక్షల మందికి రూ.17 వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేశామని, ఇంకా 18 లక్షల మంది రైతులకు రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉన్నదని మంత్రులే స్వయంగా ఒప్పుకొన్నారు. అలాంటప్పుడు రుణమాఫీ మొత్తం పూర్తి చేసినట్టు ఎలా అవుతుంది. వాస్తవాలు ఈ విధంగా కళ్ల ముందుంటే మహారాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పేశారు.

రేవంత్ అబద్ధం: **ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం.**

వాస్తవం: బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పోలీస్, గురుకుల, నర్సింగ్ ఇలా వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలను పూర్తిచేసింది. ఎన్నికలు రావడంతో ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ అభ్యర్థులకు నియామక పత్రాలు మాత్రమే అందించి ఆ ఉద్యోగాలను తాము ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నది. ఒక్క డీఎస్సీలో 5 వేల ఉద్యోగాలు తప్పా మిగతావన్నీ కూడా గత ప్రభుత్వం పూర్తిచేసిన నియామకాలే కావడం గమనార్హం.

రేవంత్ అబద్ధం : **మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 కే గ్యాస్ అందిస్తున్నాం. 50 లక్షల మందికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం.**

వాస్తవం: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి రూ.500కే గ్యాస్, ఉచిత విద్యుత్తు అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టిన ప్రభుత్వం సగం మంది అర్హులను అనర్హులుగా ప్రకటించింది. రాష్ట్రంలో 90 లక్షల రేషన్‌కార్డులు ఉండగా రూ.500కే గ్యాస్‌ను కేవలం 40 లక్షల కుటుంబాలకు ఇస్తున్నది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును 50 లక్షల కుటుంబాలకే అందిస్తున్నది. ఈ లెక్కన కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం సుమారు 50 లక్షల కుటుంబాలకు పథకాన్ని కోత పెట్టింది.

రేవంత్ అబద్ధం: **వరికి రూ.500 మద్దతు ధర అందిస్తున్నాం.**

వాస్తవం: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక కేవలం సన్నరకం ధాన్యానికే బోనస్ ఇస్తామని ప్రకటించింది. తద్వారా దొడ్డు రకం పండించే రైతులకు కాంగ్రెస్ సర్కారు ధోకా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సీజన్ల ధాన్యం కొనుగోలు చేసింది. కానీ ఆ రెండు సీజన్లకు బోనస్ ఇవ్వకుండా ఎగ్గొట్టింది. ఇప్పుడు ఈ వానకాలం సీజన్ నుంచి ఇస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు సగం పూర్తి కాగా ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా బోనస్ పైసలు ఇచ్చిన దాఖలాలు కనిపించలేదు.



మోదీ అదానీకి దోచిపెడుతుండు: రేవంత్

'ప్రధాని మోదీ దేశ సంపదను అదానీకి దోచి పెడుతున్నారని రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. మీరేమో రాహుల్‌గాంధీ మాటలకు విరుద్ధంగా అదానీతో మీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంటున్నది. దీన్ని మీరే విధంగా సమర్థించుకుంటారు' అని సీఎం రేవంత్‌రెడ్డిని విలేకరులు సూటిగా ప్రశ్నించారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. మోదీ అదానీకి దోచి పెడుతుంటే, తానేమో అదానీ జేబులోంచి పైసలు తీసుకుంటున్నా.. అని సమాధానం ఇచ్చారు. అంతకు ముందు అదే ప్రెస్‌మీట్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ రైతులకు ఎలాంటి మేలు చేయకుండా వాళ్లను దోచుకుంటూ అదానీకి దోచి పెడుతున్నారని ఆరోపించడం కొసమెరుపు. ఈ విధంగా ఓ వైపు దేశ సంపదను అదానీకి దోచి పెడుతున్నారని విమర్శిస్తూనే ఆయనతో కావాలనే ఒప్పందాలు చేసుకుంటున్నామని చెప్పడం గమనార్హం.

14 నుంచి ప్రజా విజయోత్సవాలు

- పది నెలల్లో ఊహకు అందని అభివృద్ధి
- ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం సచివాలయంలో ఉత్సవాల నిర్వహణపై జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏడాదిలో ఎన్నో విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాలతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అధివృద్ధి కార్యక్రమాలను వివరిస్తామని తెలిపారు. మూతపడిన కమలాపూర్ రేయాన్స్ పరిశ్రమను రూ.4వేల కోట్లతో పునరుద్ధరించబోతున్నామని, గ్రూప్-4 పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తామని వివరించారు. స్పోర్ట్ యూనివర్సిటీకి శంకుస్థాపన,16 నర్సింగ్ కళాశాలలు, 28 పారా మెడికల కళాశాలల ప్రారంభోత్సవం, ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం, పోలీస్ శాఖ ద్వారా డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు, డాగ్ షోలు, పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చివరి రోజున హైదరాబాద్‌లో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్‌షోలు, క్రాకర్స్ ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేకేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, ముఖ్య కార్యదర్శులు రవిగుప్తా, క్రిస్టినా జోంగ్తు, ఎం శ్రీధర్, కార్యదర్శి దాసరి హరిచందన, లోకేశ్ కుమార్ పాల్గొన్నారు.

నిజమే.. ఊహకందని పాలనే!

డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యలపై సెటైర్లు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఊహకందని అభివృద్ధి, సంక్షేమం అందించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పడంపై సెటైర్లు పేలుతున్నాయి. గత 11 నెలల్లో జరిగిన ఊహకందని విషయాలను పంచుకుంటున్నారు. 'నిజమే.. ఊహకందని పాలనే' అంటూ వ్యాగ్యాస్త్రాలు విసురుతున్నారు.

- '100 రోజులు, గ్యారంటీ' అనే పదాలకు అర్థం మారుస్తారని ఊహించలేదు
- డిక్లరేషన్లు మూలకు పడేస్తారని ఊహించలేదు
- ప్రజాపాలన దరఖాస్తులు రోడ్లపై పడతాయని ఊహించలేదు
- సర్వే పేరుతో పుట్టుపూర్వోత్తరాల వివరాలు అడుగుతారని ఊహించలేదు
- రైతుబంధు ఎగ్గొడతారని ఊహించలేదు
- సగం రుణమాఫీ చేస్తారని ఊహించలేదు.
- ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటారని ఊహించలేదు
- బతుకమ్మ చీరలు బంద్ అవుతాయని ఊహించలేదు
- పోలీసులు, హోంగార్డులు ధర్నా చేస్తారని ఊహించలేదు
- నిరుద్యోగులపై లాఠీలు విరుగుతాయని ఊహించలేదు
- ఎమ్మెల్యేలపై లాఠీచార్జీ జరుగుతుందని ఊహించలేదు
- విషాహారాలతో గురుకులాలు ఆగమవుతాయని ఊహించలేదు
- సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఊహించలేదు
- నిధులు లేక గ్రామాలు, పట్టణాలు కంపు కొడతాయని ఊహించలేదు
- రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెనక్కిపోతాయని ఊహించలేదు
- హైడ్రా పుట్టుకొచ్చి.. ఇండ్లను కూల్చుతారని ఊహించలేదు.
- మూసీ ప్రాజెక్టు పేరుతో పేదలపై పడతారని ఊహించలేదు.
- రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుందని ఊహించలేదు
- ఆర్థిక వృద్ధి తిరోగమనం చెందుతుందని ఊహించలేదు

మంత్రుల ఇండ్లకే కన్నాలు!

- మొన్న భట్టి, నేడు మంత్రి శ్రీధర్
- ఇటీవల ఆర్‌ఎస్‌పీ ఇంట్లోనూ చోరీ
- వరుస చోరీలతో ప్రజల బెంబేలు
- రాష్ట్ర సరిహద్దుల్లో తిష్టవేసిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతున్నది. దొంగలకు పోలీసులంటే భయమే లేకుండా పోయింది. ఎంతగా అంటే ఏకంగా మంత్రుల ఇండ్లకే కన్నం పెట్టేంత దారుణంగా మారింది. సాక్షాత్తు మంత్రుల ఇండ్లకే దొంగలు కన్నాలు వేస్తుంటే.. ఇంక సామాన్యుల పరిస్థితి ఎంత ఘోరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. 'మా ఇండ్లలో డబ్బులు, నగలు మాయమయ్యాయి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. తాజాగా 'నా సెల్‌ఫోన్ చోరీ అయింది బాబోయ్.. వెంటనే వెతికి పెట్టండి' అంటూ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సైబర్ క్రైమ్ పోలీసులకు మొర పెట్టుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఉంటున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సెల్‌ఫోన్ అక్టోబర్ 31 దీపావళి రోజున చోరీ అయింది. దీంతో ఫోన్‌ను వెతికి పెట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీకి పాల్పడిన బిహార్‌కు చెందిన రోషన్‌కుమార్ మండల్, ఉదయ్‌కుమార్ ఠాకూర్‌ను ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నుంచి రూ.2.2 లక్షలు, 100 గ్రాముల బంగారం, విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. మాజీ ఐపీఎస్, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంట్లో దొంగలు చొరబడి విలువైన డాక్యుమెంట్లు ఎత్తుకెళ్లిన ఘటన ఆసిఫాబాద్‌జిల్లా కాగజ్‌నగర్ మండలం కోసిని వైష్ణవి డెవలప్‌మెంట్‌లో జరిగింది.

రాష్ట్రంలో పేట్రేగిపోతున్న దొంగలు..

'పాత చెప్పినా బంగారమే' అన్నట్టు ఎక్కడెక్కడి నుంచో వస్తున్న దొంగలు రాష్ట్రంలో ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా పట్టపగలే తాళాలు పగులగొట్టి ఇండ్లలోకి దూరి చోరీలు చేస్తున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. ఏ జిల్లా చూసినా.. ఒక్కో నెలలో వందలాది చోరీల కేసులు నమోదవుతున్నాయంటే దొంగలు ఏ స్థాయిలో రెచ్చిపోతున్నారో తెలుస్తున్నది. కేవలం చోరీల కోసమే కొన్ని అంతర్రాష్ట్ర ముఠాలు తెలంగాణ సరిహద్దుల్లో తిష్టవేశాయంటే పోలీసులంటే భయం ఏమాత్రం వారిలో ఉందో ఇట్టే అర్థమవుతున్నది.

ఇటీవల జరిగిన ప్రధాన చోరీలు

- జగద్గిరిగుట్టలోని ఎల్లమ్మబండ జన్మభూమిలో ఓ ఇంట్లో రూ. 4 లక్షల నగదు, 18 తులాల బంగారం చోరీ.
- రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ.
- మియాపూర్‌లోని వరల్డ్ వన్ స్కూల్‌లో రూ.7.85 లక్షలు అపహరణ.
- నిజామాబాద్ జిల్లాలో సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టి ఎస్‌బీఐ ఏటీఎంలో 25 లక్షలు దోచుకున్న దొంగలు.
- మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్‌లో ఓ ఇంట్లో రూ.42 లక్షల విలువైన బంగారు బిస్కెట్లు, 18 తులాల బంగారు ఆభరణాలు అపహరణ.
- హైదరాబాద్ నుంచి ముంబైకి ప్రైవేట్ ట్రావెల్ బస్సులో వెళ్తున్న వ్యక్తి బ్యాగ్ నుంచి 4కిలోల బంగారు ఆభరణాలు చోరీ.
- శ్రీరాంనగర్ ఐటీసీలో రూ.50 లక్షల విలువైన సిగరెట్ల అపహరణ.

సాగర్ నీటి లెక్కలపై మళ్లీ లొల్లి

- నీటి లెక్కలను నమోదు చేయకుండా అడ్డుకున్న ఆంధ్రా అధికారులు

నందికొండ, నవంబర్ 9 : నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాల్వ వద్ద ఏర్పాటు చేసిన మీటర్ గేజ్ నుంచి నీటి విడుదలకు సంబంధించిన లెక్కను నమోదు చేసేందుకు శుక్రవారం వెళ్లిన తెలంగాణ ఇరిగేషన్ అధికారులను ఆంధ్రా అధికారులు అడ్డుకున్నారు. 'కుడి కాల్వ నీటి విడుదల లెక్కలను మీరు తీసుకోవాల్సిన అవసరం లేదు. తెలంగాణ అధికారులు మా ప్రాంతంలోకి రావద్దు' అని వాగ్వాదానికి దిగారు. విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న ఉన్నతాధికారులకు, కృష్ణా రివర్ బోర్డు అధికారులకు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు శనివారం ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు చర్చించి సమస్యను పరిష్కరించుకున్నారు. తెలంగాణ అధికారులు కుడి కాల్వ నీటి విడుదల రీడింగ్‌ను నమోదు చేసి కృష్ణా రివర్‌బోర్డు అధికారులకు పంపించారు. ఆంధ్రా ప్రాంత ఇరిగేషన్ ఏఈ వెంకటసుబ్బయ్య వల్లే జలవివాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

టెట్ దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పలువురు అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఓ అభ్యర్థి ఫీజు చెల్లించే ప్రయత్నం చేయగా చెల్లింపు పూర్తికాలేదు. మరో అభ్యర్థికి 15 నిమిషాలు వేచి చూడండి అంటూ అలర్ట్ వచ్చింది. దీంతో అభ్యర్థులు టెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఆశ్రయిస్తున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. శనివారం వరకు 6,888 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జీ రమేశ్ తెలిపారు. పేపర్-1కు 2,317, పేపర్-2కు 3,950, రెండు పేపర్లు రాసే వారు 621 చొప్పున 6,888మంది అభ్యర్థులు టెట్ కు దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు.

దళిత మహిళలపై మంత్రి శ్రీధర్‌బాబు కక్ష సాధింపు

- బీఆర్‌ఎస్ నేత చేసిన సాయాన్ని చెబితే ఉద్యోగాలు ఊడగొడ్తారా?
- తిరిగి విధుల్లోకి తీసుకోవాలి: మాలమహానాడు డిమాండ్

మాట్లాడుతున్న సువర్ణ, శ్రీకృష్ణ

రవీంద్రభారతి, నవంబర్ 9: బీఆర్‌ఎస్ నేత చేసిన సాయాన్ని ఎన్నికల్లో చెప్పినందుకు కక్షగట్టిన మంత్రి శ్రీధర్‌బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత మహిళలను ఉద్యోగాల నుంచి తొలగించడం అమానుషమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని మాలమహానాడు డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ, దళిత క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజోస్, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు సువర్ణతో కలిసి మాట్లాడారు. మంథని నియోజకవర్గం, కాటారం మండలం, ధన్వాడలో పదేండ్లుగా సువర్ణ మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్నదని తెలిపారు. ప్రమాదవశాత్తు సువర్ణ ఇల్లు కాలిపోగా.. బీఆర్‌ఎస్ నేత పుట్ట మధు సాయం చేసిన విషయాన్ని ఎన్నికల ప్రచారంలో చెప్పిందన్నారు. దీంతో ఆమెపై కక్ష గట్టిన మంత్రి, సోదరుడు శ్రీను.. మధ్యాహ్న భోజన పథకం నుంచి తొలగింపజేశారని తెలిపారు. సువర్ణ మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పుట్ట మధు చేసిన సాయాన్ని చెప్పానని, అధికారంలోకి రాగానే కక్షగట్టిన మంత్రి శ్రీధర్, ఆయన సోదరుడు తనను, తనతోపాటు పనిచేసే ఇద్దరు దళిత మహిళలను విధుల్లో నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కాలినప్పుడు, పిల్లల పెండ్లిళ్లకు సాయం చేసిన పుట్ట మధు పేరు చెప్పడమే పాపమా అని కన్నీటి పర్యంతమయ్యారు. మంత్రి, అతని సోదరుడిపై సీఎం చర్యలు తీసుకొని తమను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పల్లెలు తాగాలి.. ఖజానా నిండాలి!

- ఎక్సైజ్ శాఖకు సర్కారు దిశానిర్దేశం
- నెలవారీ మద్యం విక్రయాలను 25 శాతం పెంచుతూ టార్గెట్
- లక్ష్యం పూర్తిచేయని 30 మంది ఎక్సైజ్ అధికారులకు మెమోలు
- విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- ఎమ్మెల్యేల సిఫారసు లేఖను, ఫోన్‌కాల్ అభ్యర్థనను గౌరవించాలని ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): 'ఊళ్లలో బెల్టు దుకాణలు పెంచండి. అప్పుడే జనం బాగా తాగుతారు. లేకుంటే టార్గెట్ రీచ్ కాలేం. మద్యం సేల్స్ పెంచని అధికారులను గుర్తించి మెమోలు ఇస్తాం. రెండోసారి మెమో వచ్చిందంటే వారిని నిర్దాక్షిణ్యంగా బదిలీ చేస్తాం. ఏడాది వరకు మళ్లీ పోస్టింగ్ ఉండదు. బెల్టు దుకాణల కోసం ఎమ్మెల్యేల సిఫారసు లేఖను, ఫోన్‌కాల్ అభ్యర్థనలను గౌరవించండి'.. ఇవీ ఎక్సైజ్‌శాఖ కేంద్ర కార్యాలయం నుంచి దిగువ శ్రేణి అధికారులకు అందిన మౌఖిక ఆదేశాలు. ఏం చేసైనా సరే అమ్మకాలు పెంచాలనే ఆదేశాలతో ఉన్నతాధికారులు తమ కింది అధికారులను వేధిస్తున్నారు. గతంలో ఎక్కడైనా బెల్టుషాపు కనిపిస్తే చాలు దాడులు చేసి, కేసులు పెట్టిన ఎక్సైజ్ అధికారులే ఇప్పుడు బెల్టుషాపులను పెంచాలని చెప్పుండటంతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది.

ఎందుకీ పరిస్థితి?

లిక్కర్ ఆదాయాన్ని భారీగా పెంచడంపై రాష్ట్ర సర్కారు దృష్టిపెట్టింది. గతంలో ఎక్సైజ్ శాఖ ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పడిన మంత్రివర్గం ఉపసంఘం నిధులు ఎలా పెంచాలనే విషయంపై సుదీర్ఘంగా చర్చించింది. ఆరు గ్యారంటీలకు సంబంధించిన నిధులు, ఉద్యోగుల జీతభత్యాలు కూడా మద్యం నుంచే రాబట్టాలని ఎక్సైజ్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం 2,620 ఏ4 మద్యం దుకాణాలు, 1200 బార్లు, క్లబ్బులు ఉన్నాయి. వీటి ద్వారా మద్యం విక్రయాలు, అన్ని రకాల సుంకాలు కలుపుకొని 2023లో రూ.32 వేల కోట్లు ఆదాయం సమకూరింది. ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని రూ. 45 వేల కోట్లకు పెంచినట్టు తెలిసింది. దీంతో ఎక్సైజ్ అధికారులకు జిల్లాలవారీగా టార్గెట్లు కేటాయించారు. ఎక్సైజ్ స్టేషన్ స్వభావాన్ని, పరిధిని బట్టి 10 శాతం నుంచి 25 శాతం వరకు పెంచాలనే టార్గెట్ పెట్టారు. ఉదాహరణకు ఒకషాపులో నిరుడు నవంబర్ పదో తేదీ నాటికి ఒక ఏ గ్రేడ్ మద్యం దుకాణం రూ. 20 లక్షల సరుకు విక్రయిస్తే, ఈ ఏడాది నవంబర్ 10 నాటికి రూ. 25 లక్షల సరుకు అమ్మాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో లిక్కర్ వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ బెల్టు షాపులను తెరుస్తున్నారు. కిరాణాషాపుల్లోనూ మద్యం అమ్మే పరిస్థితి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1.75 లక్షల బెల్టు దుకాణాలు వెలిశాయని, మరో రెండు నెలల కాలంలో ఈ సంఖ్య రెండు లక్షలకు చేరుకునే అవకాశం ఉన్నదని ఎక్సైజ్ సీనియర్ అధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

'బెల్టు' యాజమాన్యంతో ఒప్పంద పత్రాలు..!

ఏ4 మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మాలని ఎక్సైజ్ అధికారులు గట్టి హెచ్చరికలు జారీచేశారు. దుకాణాల ముందు మద్యం ధరల పట్టిక కచ్చితంగా పెట్టాలని ఇటీవల ఎక్సైజ్ కమిషనర్ సర్క్యులర్ జారీచేశారు. ఈ నిబంధన గతంలోనే ఉన్నా, కమిషనర్ ఇటీవల మరోసారి జారీచేశారు. లైసెన్స్ కలిగిన దుకాణం బయట మాత్రం ఇటువంటి ఆంక్షలు ఏమీ లేవని చెప్తున్నారు. అయితే బెల్టు దుకాణల్లో పరిమిత ఎమ్మార్పీ ఉల్లంఘన అమలు చేయాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం క్వార్టర్ లిక్కర్‌పై రూ.10 నుంచి రూ.15 వరకు అదనంగా తీసుకుంటున్నారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించింది. ఎక్కువ ధరకు విక్రయించడం వలన జనం తక్కువ తాగుతున్నారని, ఫలితంగా సేల్స్ తగ్గుతున్నదని ఆబ్కారీ అధికారులు విశ్లేషించారు. కాబట్టి పరిమిత ఎమ్మార్పీ ఉల్లంఘన ఉంటే మరింత ఎక్కువ మందికి తాగించవచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. అనుమతించిన ఎమ్మార్పీ ఉల్లంఘన మేరకే మద్యం అమ్మేలా బెల్టుషాపుల యాజమాన్యంతో ఒప్పంద పత్రాలు కూడా రాయించుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

యువర్ పెర్ఫార్మెన్స్ ఈజ్ నాట్ అప్ టు మార్క్

మద్యం విక్రయాల్లో టార్గెట్ అందుకోలేని అధికారులకు నేరుగా ఎక్సైజ్ కమిషనర్ మెమోలు ఇస్తున్నారు. గడిచిన రెండు నెలల కాలంలో 30 ఎక్సైజ్ సీఐలు మెమోలు అందుకున్నట్టు తెలిసింది. 'యువర్ పెర్ఫార్మెన్స్ ఈజ్ నాట్ అప్ టు మార్క్' అని మెమోలు జారీ చేస్తున్నారు. మొదటిసారి మెమో హెచ్చరికగా తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. రెండోసారి కూడా టార్గెట్ అందుకోలేకపోతే బదిలీ చేస్తామని, ఏడాది పాటు ఏ స్టేషన్‌లోనూ పోస్టింగ్ ఇవ్వమని గట్టి వార్నింగ్ ఇస్తున్నట్టు తెలిసింది. దీంతో ఎక్సైజ్ అధికారులు అడ్డదారుల్లో, అడ్డగోలుగా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. గత నెల చివరి వారంలో, ఈ నెల మొదటి వారంలో దాదాపు 18 జిల్లాల్లో విక్రయాలు వెనుకబడ్డాయని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఆయా జిల్లాలోఎక్సైజ్ స్టేషన్ వారీగా లెక్కలు తీసి మైనస్ విక్రయాలు ఉన్న స్టేషన్ అధికారికి మెమోలు జారీ చేసినట్టు తెలిసింది.